ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

5★

శుక్రవారం 23 ఆగస్టు 2024

శిక్ష పడే విధంగా నేర పరిశోధన జరగాలి : సీపీ 8లో..

అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సత్తా చాటాలి 8లో..



ప్రతిపాదనలకే పరిమితం

- జిల్లాలో జాడలేని కొత్త పోలీస్ స్టేషన్లు
- అప్‌గ్రేడ్‌కు నోచుకోని పలు ఠాణాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పదోన్నతులు లేక ఆందోళనలో పోలీసులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలో కొత్త పోలీస్ స్టేషన్ల ఏర్పాటు ప్రతిపాదనలు దాటకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎప్పటి నుంచో అప్‌గ్రేడ్ చేయాల్సిన పోలీస్ స్టేషన్లు అప్‌గ్రేడ్‌కు నోచుకోకపోవడంతో పదోన్నతులు దక్కక పోలీసులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో ఉన్న పాత పది జిల్లాల పునర్విభజనలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాను కరీంనగర్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాగా ఏర్పాటుచేసి 2016 అక్టోబర్ 11వ తేదీ నుంచి కొత్త జిల్లాల కేంద్రంగా పరిపాలన ప్రారంభమయ్యింది. పెద్దపల్లి జిల్లాను 14 మండలాలతో ఏర్పాటు చేశారు. రామగుండం మండలంను మూడు మండలాలుగా రామగుండం, అంతర్గాం, పాలకుర్తిగా విభజించారు. కమాన్‌పూర్ మండలాన్ని కమాన్‌పూర్, రామగిరి మండలాలుగా విభజించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతి మండలానికి ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ మేరకు కొత్తగా ఏర్పడ్డ అంతర్గాం, రామగిరి మండలాల్లో కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేశారు. పాత రామగుండంలో రామగుండంతో పాటు అదనంగా బసంత్‌నగర్‌లో పోలీస్ స్టేషన్ ఉండడంతో ఆ స్టేషన్ పాలకుర్తి మండలంలో ఉండడంతో దానిని ఆ మండలానికి సద్వినియోగం చేసుకుంటున్నారు.



అలాగే ముప్పయేళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కరీంనగర్ జిల్లాలో 57వ మండలంగా జూలపల్లి మండలం నుంచి వేరు పడిన ఎలిగేడు మండలానికి నేటికీ పోలీస్ స్టేషన్ లేకపోవడం గమనార్హం. ఎలిగేడు మండల ప్రజలకు శాంతి భద్రతల సమస్య తలెత్తినప్పుడు జూలపల్లి పోలీస్ స్టేషన్‌కే వెళ్లాల్సి వస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ మండలానికి పోలీస్ స్టేషన్ ఏర్పాటు కాకపోయినా, తెలంగాణ వచ్చిన తర్వాతనైనా కొత్త స్టేషన్ వస్తుందని ఆ మండల ప్రజలు ఆశించారు. బీఆర్ఎస్ హయాంలో కొత్త జిల్లాలు, మండలాల పునర్విభజన జరిగిన తర్వాత కొత్త మండలాల్లో పోలీస్ స్టేషన్లను ఏర్పాటుచేసిన నాటి ప్రభుత్వం ఎలిగేడు మండలాన్ని విస్మరించింది. పోలీస్ ఉన్నతాధికారులు ఎన్ని ప్రతిపాదనలు పంపినా కూడా పోలీస్ స్టేషన్ మంజూరు కాలేదు. పెద్దపల్లి జిల్లాగా ఏర్పాటైన తర్వాత కూడా ఎలిగేడుతో పాటు పెద్దపల్లి రూరల్, పెద్దపల్లి ట్రాఫిక్, పెద్దపల్లి మహిళా పోలీస్ స్టేషన్ల కోసం ప్రతిపాదనలు వెళ్లినా కూడా మంజూరు కాలేదు. పెద్దపల్లి జిల్లా అయిన తర్వాత ట్రాఫిక్ పెరిగిపోయింది. దీంతో పోలీస్ కమిషనరేట్ నుంచి పెద్దపల్లిలో తాత్కాలికంగా ఒక ట్రాఫిక్ స్టేషన్‌ను ఏర్పాటుచేసి స్టేషన్‌ను నడిపిస్తున్నారు. కానీ సిబ్బంది కొరత వెంటాడుతున్నది. పోలీస్ స్టేషన్ మంజూరు చేస్తే ఒక సీఐ, ఒక ఎస్ఐ, ముగ్గురు ఏఎస్ఐలు, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు, 28 మంది పోలీస్ కానిస్టేబుల్ పోస్టులను మంజూరుచేస్తారు. ప్రస్తుతానికి గోదావరిఖని ట్రాఫిక్ పోలీస్ సిబ్బందినే సర్దుబాటు చేసి నడిపిస్తున్నారు. పెద్దపల్లి మండలం జిల్లాలోనే పెద్దది. కానీ ప్రత్యేకించి రూరల్ పోలీస్ స్టేషన్ లేకపోవడం గమనార్హం. ఈ మండలంలోని రాఘవాపూర్, రంగాపూర్, సబ్బితం, బొంపెల్లి, అప్పన్నపేట, రాగినేడు, కుమ్మరపల్లి, తదితర గ్రామాలు బసంత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నాయి. రూరల్ స్టేషన్‌ను ఏర్పాటుచేసి ఆ గ్రామాలతో పాటు మండలంలోని మిగతా గ్రామాలను తీసుకరావాలని ప్రతిపాదించారు. మహిళలపై అఘాయిత్యాలు, ఇతరత్రా నేరాలు జరుగుతున్నందున జిల్లా కేంద్రంలో మహిళా పోలీస్ స్టేషన్ లేక ఇబ్బందులు పడుతున్నారు.

మరికొన్ని పోస్టులు పెరిగే అవకాశం..

జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లు ఇంకా అప్‌గ్రేడ్‌కు నోచుకోవడం లేదు. జిల్లా కేంద్రమైన పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్, ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్లు ఇప్పటికీ సబ్ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా నడుస్తున్నాయి. వీటి పరిధిలో అత్యంత జనాభా కలిగి ఉంటాయి. ఎన్టీపీసీ స్టేషన్ రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండగా, పెద్దపల్లి, మంథని, సుల్తానాబాద్ స్టేషన్లు మున్సిపాలిటీల పరిధిలో ఉన్నాయి. ఇంతకంటే తక్కువ జనాభా గల కరీంనగర్ జిల్లాలోని మానకొండూర్ పోలీస్ స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా సీఐ వ్యవహరిస్తుండడం గమనార్హం. మానకొండూర్ నియోజకవర్గ కేంద్రం కావడంతో అప్పట్లో ఆ స్టేషన్‌ను అప్‌గ్రేడ్ చేయగా, పెద్దపల్లి, మంథని కూడా నియోజకవర్గ కేంద్రాలు అయినప్పటికీ అప్‌గ్రేడ్ కాలేదు. ఈ స్టేషన్లను అప్‌గ్రేడ్ చేసినట్లయితే మరికొన్ని పోస్టుల సంఖ్య పెరగనున్నాయి. దీంతో కొందరు పోలీసులకు పదోన్నతులు లభించే అవకాశాలున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్లను అప్‌గ్రేడ్ చేయగా, ఎప్పటి నుంచో ప్రతిపాదనల్లో ఉన్న కొత్త పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయడంతో పాటు పలు స్టేషన్లను అప్‌గ్రేడ్ చేయించేందుకు జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీస్ వాహనాలను తనిఖీ చేసిన సీపీ



వాహనాలను తనిఖీ చేస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 22: రామగుండం కమిషరేట్ పరిధిలోని బెల్లంపల్లి సబ్‌డివిజన్‌కు చెందిన పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణను గురువారం కమిషనర్ శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ వాహనాలను నిరంతరంగా ప్రజాసేవలకు వినియోగించాల్సి ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలన్నారు. వాహనాలపై ప్రత్యేక శ్రద్ధ వహించలని, మంచి కండిషన్‌లో ఉంచుకోవాలని వాహన డ్రైవర్లను ఆదేశించినారు. పోలీసు అధికారుల ఆధీనంలో ఉన్న వాహనాలను సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, సొంత వాహనంలా మంచి కండిషన్‌లో ఉంచి ఎప్పటికప్పుడు సర్వీసింగ్, ఇంజన్ ఆయిల్, టైర్ల నిర్వహణ, ఉత్తమ ప్రమాణాలను పాటించుకుంటూ, డ్రైవర్లకు నిర్వహణపై ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర, ఏఆర్ ఏసీపీ సురేంద్ర, ఆర్ఐ (ఎంటీఓ) సంపత్ పాల్గొన్నారు.

ఆడిట్ నిర్వహణకు దరఖాస్తులు సమర్పించాలి

- అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపల్ రికార్డుల ఆడిట్ నిర్వహణకు ఆసక్తిగల ఆడిటర్లు ఈనెల 27లోపు దరఖాస్తులు సమర్పించాలని అదనపు కలెక్టర్ జే అరుణశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఉన్న రామగుండం నగర పాలక సంస్థతో పాటు పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలలోని ఏరియా లెవెల్ ఫెడరేషన్, టౌన్ లెవెల్ ఫెడరేషన్‌కు సంబంధించిన రికార్డులను ఆడిట్ చేయడానికి ఆసక్తి, అర్హత అనుభవం కలిగిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఆడిటర్లు పూర్తివివరాలతో పాటు తగిన ధ్రువీకరణ పత్రాలను జతచేస్తూ దరఖాస్తు సమర్పించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఆడిట్ నిర్వహణకు ఆసక్తి అర్హత కలిగిన ఆడిటర్లు తమ దరఖాస్తులను పథక సంచాలకులు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాలయంలో ఆగస్టు 27లోపు సమర్పించాలని, వివరాలకు 9703598383 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- జిల్లా విద్యాశాఖాధికారి డి మాధవి

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమాలను ఈనెల 23న అన్ని పాఠశాలల్లో ఘనంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి డి మాధవి ఒక ప్రకటనలో కోరారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) గత ఏడాది ఇదేరోజున విక్రమ్ ల్యాండర్ సహాయంతో ప్రజ్ఞాన్ రోవర్ జాబిల్లి దక్షిణ ధృవంపై విజయవంతంగా దిగిన సందర్భాన్ని పురస్కరించుకుని ఆగస్టు 23ను జాతీయ అంతరిక్ష దినోత్సవంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని యాజమాన్యాల పాఠశాలల్లో విద్యార్థులకు ఆ చారిత్రక ఘట్టాన్ని మరోమారు తిలకించే విధంగా మండల విద్యాధికారులు, ప్రధానోపాధ్యాయులు తగిన ఏర్పాట్లుచేయాలని ఆదేశించారు. అదేవిధంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, ప్రముఖ శాస్త్రవేత్తలచే ఉపన్యాసాలు లాంటి కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. అయా పోటీలకు సంబంధించిన విజేతలైన విద్యార్థుల వివరాలను సంక్షిప్తంగా నివేదిక రూపంలో ఫొటోలతో సహ ఎస్ఈఆర్టీ గూగుల్ ఫాంలో, ఈనెల 24 లోగా పొందుపరచాలని తెలిపారు. మరిన్నీ వివరాలకై జిల్లా సైన్స్‌అధికారిని ఫోన్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

కార్యదర్శులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

కమాన్‌పూర్, ఆగస్టు 22 : గ్రామ కార్యదర్శులు విధులను బాధ్యతగా నిర్వహించాలని ఎంపీడీవో లలిత అన్నారు. గురువారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గ్రామ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీవో కాట బాస్కర్, ఉపాధి హామీ ఏపీవో లావణ్య, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ

రామగిరి, ఆగస్టు 22: మండలంలోని పన్నూరు గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను ఎంపీడీవో శైలజా రాణి, మెడికల్ ఆఫీసర్ ప్రదీప్‌కుమార్‌లు గురువారం తనిఖీ నిర్వహించారు. కిచెన్, డైనింగ్‌హాల్, టాయిలెట్స్‌ను పరిశీలించారు. విద్యార్థుల్లో జ్వర లక్షణాలు కనిపించినట్లైతే వెంటనే సమచారం ఇవ్వాలని సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం బోజనం పెట్టాలని పేర్కోన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ఏఎన్ఎంలు ఉన్నారు.

పాలకుర్తి : పాలకుర్తి మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం ఎంపీడీవో పొల్సాని శశికళ పర్యటించారు. కుక్కలగూడూర్ గ్రామంలోని సంపద వనాలను సందర్శించారు. జయ్యారంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని, ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని, పుట్నూర్ గ్రామంలోని కస్తూర్బా పాఠశాలను పరిశీలించారు. ఆమె వెంట ఎంపీవో సుదర్శన్ తదితరులు ఉన్నారు.

వనమహోత్సవంపై సాంస్కృతిక కార్యక్రమం

ఎలిగేడు, ఆగస్టు 22 : మండలంలోని సుల్తాన్‌పూర్ ప్రగతి టెక్నో స్కూల్‌లో గురువారం విద్యార్థులు వన మహోత్సవంపై సాంస్కృతిక కార్యక్రమం చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవ కార్యక్రమ అన్ని ప్రజలు ఆదర్శంగా తీసుకోవాలని విద్యార్థులు విడమరిచి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రగతి టెక్నో స్కూల్ కరస్పాండెంట్ సురేందర్, ప్రిన్సిపాల్ కావ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

పెద్దపల్లి రూరల్ : వనమహోత్సవంలో భాగంగా గ్రామాల్లో అమ్మ కోసం ఒక చెట్టు నాటుదాం అనే నినాదంతో గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని బొంపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంపత్ ఆధ్వర్యంలో గ్రామంలో యువకులు, గ్రామస్థులు మొక్కలు విరివిగా నాటారు. అలాగే రాఘవపూర్, నిమ్మనపల్లి, నిట్టూరు, తుర్కలమద్దికుంట, హన్మంతునిపేటతో పాటు పలు గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహించారు.

బీఆర్ఎస్ హయాంలో అరకొర నిధులతో నిలిచిన అభివృద్ధి

- మేయర్ బంగి అనీల్ కుమార్

కోల్‌సిటీ, ఆగస్టు 22: బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అరకొర నిధులతో అభివృద్ధి నిలిచిపోయిందని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ విమర్శించారు. గోదావరిఖని ప్రధాన వ్యాపార కూడళ్లలో రూ.29.5కోట్ల టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేసిన నేపథ్యంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.100 కోట్లు తమ ప్రభుత్వమే ఇచ్చిందని బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేయడంపై ఆయన స్పందించారు. గురువారం రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో నిధులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రచార హడావుడి చేయడం తప్ప టీయూఎఫ్ఐడీసీ నుంచి ఒక్కపైసా కూడా రామగుండానికి విడుదల చేయలేదన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ చొరవతో నగర అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.100కోట్లతో పాటు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కూడా విడుదల చేయించుకువచ్చారన్నారు. గతంలో 2017లో బీఆర్ఎస్ ప్రభుత్వం రామగుండం నగర అభివృద్ధికి సంవత్సరానికి రూ.100కోట్లు మంజూరు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ ఇప్పటికీ నిధులు రాలేదని, పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా రాలేదన్నారు. తర్వాత పట్టణ ప్రగతి నిధులు మంజూరు అవుతాయని నమ్మకంతో పనులు అప్పగిస్తే పూర్తయిన తర్వాత నిధులు విడుదలకాకపోవడంతో కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మరో పని చేయడానికి వారి వద్ద డబ్బులు లేక పలు అభివృద్ధి పనులు నిలిచిపోయాయన్నారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపల్లిలో నిర్వహించిన బహిరంగ సభలో ఇతర చిన్న మునిసిపాలిటీలతో పాటుగా కార్పొరేషన్ స్థాయిలో ఉన్న రామగుండం నగరపాలక సంస్థకు స్వల్పంగా ఒక్క కోటి మాత్రమే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ మంజూరు చేస్తున్నట్లు ప్రకటన చేయడం గమనార్హమన్నారు. పట్టణ ప్రగతి నిధులతో పిలిచిన పలు అభివృద్ధి పనులకు నిధులు రాక రద్దు చేసే పరిస్థితి వచ్చిందన్నారు. తాను కార్పొరేటర్‌గా ప్రాతినిధ్యం వహిస్తున్న 30వ డివిజన్ సీతానగర్‌లో ప్రజలకు అత్యవసరంగా ఉన్న ఒక వంతెనను నిర్మించడానికి రూ.15లక్షల అంచనా వ్యయంతో పని ప్రతిపాదించినప్పటికీ నిధులు లేవని కాంట్రాక్టర్లు పని చేయడానికి ముందుకు రావడం లేదన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ చొరవతో నిధులు విడుదలై పనులు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ నాయకులు వాస్తవాలను వక్రీకరించవద్దని సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో కొత్త మున్సిపల్ చట్టం తీసుకవచ్చి ప్రజాప్రతినిధులు, మేయర్, కౌన్సిల్‌కు అధికారాలు లేకుండా చేసి కలెక్టర్లకు అప్పగించారన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పని చేసే పార్టీ అన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ బాల రాజ్ కుమార్, నాయకులు అడ్డాల రామస్వామి, ఫక్రుద్దీన్, గణముక్కుల తిరుపతి, దుబాసి మల్లేష్, పొన్నం లక్ష్మణ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆర్‌వోఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై చర్చ

- కొత్త ఆర్‌వోఆర్ చటం అమల్లోకి వచిన వెంటనే రూల్స్ రూపొందించాలని పలువురి సూచన

పెద్దపల్లి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని అమల్లోకి తీసుకవచ్చిన నెల రోజుల్లోనే రూల్స్ రూపొందించాలని, గ్రామాల్లోని ఆబాది భూముల రికార్డులు అప్డేట్ చేయాలని, సాదాబైనమా భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయాలని, పొజిషన్ కాలం ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఆర్డీవో స్థాయిలో ఉండాలని పలువురు సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ శ్రీహర్ష నేతృత్వంలో ప్రభుత్వం నూతంగా రూపొందించిన ఆర్‌వోఆర్ చట్టం 2024 ముసాయిదా బిల్లుపై చర్చ కార్యక్రమాన్ని నిర్వహించారు.



ఆర్‌వోఆర్ బిల్లుపై నిర్వహించిన చర్చలో పాల్గొన్న కలెక్టర్ తదితరులు

నూతన చట్టంలో పేర్కొన్న అంశాలు, ఈ బిల్లు ఉద్దేశం గురించి అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ వివరించారు. చర్చలో పాల్గొన్న రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు సుదర్శన్, శంకరయ్య, న్యాయవాదులు శశి భూషణ్ కాచె, సాయిల్‌రెడ్డి, టీఎన్జీవో అధ్యక్షుడు బొంకూరి శంకర్ తమ సూచనలు సలహాలు తెలిపారు. గ్రామంలోని ఆబాది భూముల రికార్డులు అప్డేట్ చేయాలని, సాదాబైనమా భూముల రిజిస్ట్రేషన్ రుసుం వసూలు చేయాలని, పొజిషన్ కాలం ఉండాలని, అప్పిలేట్ అథారిటీ ఆర్డీవో స్థాయిలో ఉండాలన్నారు.

పెద్దపల్లి తహసీల్దార్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 1971 సంవత్సరంలో ఆర్వోఆర్ చట్టం తెస్తే 1989లో రూల్స్ అందించారని, 2020 ఆర్వోఆర్ చట్టానికి ఇప్పటివరకు రూల్స్ తయారు చేయలేదని, నూతన ఆర్వోఆర్ చట్టం 2024 అమలు చేసిన నెల రోజుల లోపల రూల్స్ రూపొందించాలని తెలిపారు. నూతన ఆర్వోఆర్ చట్టం అమలు కోసం ప్రతి గ్రామంలో రెవెన్యూ ఉద్యోగి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, భూసమస్యల అప్పిలేట్ అథారిటీ జిల్లా స్థాయిలోనే ఉండే విధంగా చూడాలని తెలిపారు.

రాతపూర్వకంగా సలహాలు ఇవ్వాలి : కలెక్టర్

నూతన ఆర్ఓఆర్ చట్టం ముసాయిదా బిల్లుపై రెండు, మూడు రోజుల్లో రాతపూర్వకంగా ఇవ్వాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. బిల్లుపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసం నూతన ఆర్వోఆర్ చట్టం రూపొందించాలని ప్రభుత్వం సంకల్పించిందని, దేశంలో వివిధ రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమమైన భూ రికార్డుల నిర్వహణను పరిశీలించిన నిపుణుల బృందం నూతన ఆర్వోఆర్ 2024ముసాయిదా బిల్లును రూపొందించిందని తెలిపారు. నూతన చట్టం రూపకల్పనలో విస్తృతంగా ప్రజలను భాగస్వామ్యం చేయాలనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. భూ రికార్డుల నిర్వహణకు మెరుగ్గా ఉండే విధంగా ముసాయిదా బిల్లుపై రైతు సంఘాలు, మేథావులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు (రిటైర్డ్ సర్వీస్) సూచనలను రాతపూర్వకంగా అందజేయాలని కలెక్టర్ కోరారు. వాటిని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు బి గంగయ్య, వి హనుమానాయక్, తహసీల్దార్లు, నిపుణులు, న్యాయవాదులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అల్ఫోర్స్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న నరేందర్‌రెడ్డి

సుల్తానాబాద్, ఆగస్టు 22: స్థానిక అల్ఫోర్స్ విద్యాసంస్థలో గురువారం కృష్ణాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను విద్యా సంస్థల చైర్మన్ నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. చిన్నారుల ప్రదర్శనలు తిలకించి అభినందించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు, నాటికలు ఆకట్టుకున్నాయి. నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం చిన్నారులు చేసిన ఉట్టి కొట్టె వేడుకల్లో అందరూ ఆసక్తిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్ వేధింపులపై ఫిర్యాదు

కళ్యాణ్‌నగర్, ఆగస్టు 22: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఓ సూపర్‌వైజర్ తమను అసభ్య పదజాలంతో దూషిస్తున్నాడంటూ కాంట్రాక్టు కార్మికులు కాంట్రాక్టర్‌కు ఫిర్యాదు చేశారు. డ్యూటీల మార్పు విషయంలో మహిళలపై బూతు పురాణం మొదలు పెట్టడంతో అక్కడున్న కొంత మంది కార్మికులు సూపర్‌వైజర్‌పై తిరుగుబాటు చేశారు. కొద్ది రోజులుగా సూపర్‌వైజర్ డ్యూటీ మార్పు విషయంలో డబ్బులు, బిర్యాణీలు ఇవ్వాలంటూ వేధింపులకు గురి చేస్తున్నాడని, పారిశుధ్య కార్మికులను రోజుకు ఒకరు బిర్యాణి ఇస్తే డ్యూటీలు చేంజ్ చేస్తున్నారని, లేకుంటే నిరంతరం ఒకే విధులు నిర్వహించాలని వేధిస్తున్నాడని, నెల రోజుల పాటు డ్యూటీలు రోస్టర్ పద్ధతిలో మార్చకుండా వేధింపులకు గురిచేయడంతో ఇటీవల కార్మికులు సూపరింటెండెంట్‌కు మొర పెట్టుకున్నారు. దీంతో సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్లు కాంట్రాక్టర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే ఉన్నత విద్య

పెద్దపల్లి రూరల్, ఆగస్టు 22 : ప్రభుత్వ కళాశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.లక్ష్మీనర్సయ్య అన్నారు. గురువారం కళాశాలలో నూతన విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అధ్యాపకులు ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ అనంతల సతీష్‌కుమార్, డాక్టర్ పురుషోత్తం, మంజీరా జాఫ్రీ, వివిధ విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకటరామిరెడ్డికి ఘన నివాళులు

మంథని, ఆగస్టు 22: రాజాబహదూర్ వెంకటరామిరెడ్డికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గురువారం ఘనంగా నివాళులర్పించారు. వెంకటరామిరెడ్డి జయంతి సందర్భంగా మంథని పట్టణంలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనం ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి పుట్ట మధు పూలమాలలు వేసి నివాళులర్పించి ఆయన ప్రజలకు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలు సంరక్షించుకోవాలి : కలెక్టర్ శ్రీహర్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీహర్ష



హాస్టల్‌లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న కలెక్టర్

కాల్వశ్రీరాంపూర్, ఆగస్టు 22: వనమహోత్సవం కార్యక్రమం కింద గ్రామాలలో నాటిన మొక్కల సంరక్షణకు వాచర్స్‌ను నియమించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఎంపీడీవో కార్యాలయంతో పాటు తాసిల్దార్ కార్యాలయం, ఎస్సీ వసతిగృహాన్ని కలెక్టర్ శ్రీహర్ష తనిఖీ చేశారు. కాల్వశ్రీరాంపూర్‌లోని ఎస్సీ ప్రభుత్వ బాలికల వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్ పంచాయతీ కార్యదర్శుల ద్వారా వసతి గృహాల్లో పారిశుధ్య నిర్వహణను నిరంతరం పర్యవేక్షించాలని ఎంపీడీవోను ఆదేశించారు. కాల్వశ్రీరాంపూర్ తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి పెండింగ్ ధరణి దరఖాస్తుల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, మొక్కల పెంపకం, తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్యం, వన మహోత్సవం కార్యక్రమం, తాగునీటి సరఫరా తదితర వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో పారిశుధ్య నిర్వహణకు పక్కా ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలని, గ్రామాల పరిధిలోని ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గ్రామాలలో ఎక్కడ డార్క్ ఏరియా ఉండటానికి వీలు లేదని, అవసరమైన చోట వెంటనే వీధి దీపాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వన మహోత్సవం కార్యక్రమం క్రింద 100శాతం మొక్కలు నాటే లక్ష్యం పూర్తయిందని తెలుసుకున్న కలెక్టర్ వాటి సంరక్షణకు వాచర్స్‌ను నియమించాలని అధికారులకు సూచించారు. ప్రతి గ్రామంలో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని, తడి చెత్తతో తప్పనిసరిగా వర్మి కాంపోస్ట్ రూపొందించాలని, జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించిన వివరాలతో కూడిన 7 రిజిష్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో రామ్మోహన్‌చారి, తహసీల్దార్ శంకర్, సంబంధిత ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

కరీంనగర్ క్రైం, ఆగస్టు 22: కరీంనగర్ అశోక్‌నగర్‌లో బుధవారం వేకువ జామున జరిగిన హత్య కేసులో నిందితుడు మీర్జా ఇబ్రహీం బేగ్ అలియాస్ మీర్జా సుఫియాన్ బేగ్(20)ని గురువారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచామని ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. మద్యం విషయంలో గొడవ పడి అశోక్‌నగర్‌కు చెందిన ఎండీ ముజాయిద్‌ఖాన్(32)పై సిమెంట్ ఇటుకతో దాడి చేసి హత్య చేశాడు. దీంతో కోర్టు ఆదేశాలతో నిందితుడు సుఫియాన్‌బేగ్‌ను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సరిలాల్ తెలిపారు.

పీహెచ్‌సీని తనిఖీ చేసిన జిల్లా మలేరియా వైద్యాధికారి

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలంలోని కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం జిల్లా మలేరియా వైద్యాధికారి ఉమాశ్రీరెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు.ఆరోగ్య కేంద్రానికి వైద్యం కోసం వచ్చిన జ్వరంతో బాధపడుతున్న వారితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం తాడికల్‌లో జ్వరాల బారిన పడిన వారి ఇళ్ల వద్దకు వెళ్లి రోగ లక్షణాలను అడిగి తెలుసుకున్నారు. వ్యాధి నిర్ధారణల పరీక్షల కోసం రక్త నమూనాలను సేకరించారు. పరిశుభ్రతపై వారికి అవగాహన కల్పించారు. ఆయన వెంట పీహెచ్‌సీ డాక్టర్ శ్రావణ్ కుమార్ సిబ్బంది ఉన్నారు.

పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


క్షేత్ర స్థాయి పర్యటనలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

జగిత్యాల అగ్రికల్చర్, ఆగస్టు 22: ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం పొలాస, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ బృందం ఆధ్వర్యంలో జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో రైతులు సాగు చేస్తున్న పంటలను శాస్త్రవేత్తల బృందం పరిశీలించారు. పత్తిలో ఆకు మచ్చ తెగులు, పిండినల్లి, రసం పీల్చే పురుగుల ఉధృతిని గుర్తించారు. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్రోపికోనజోల్ 200 మిల్లీలీటర్లు ఎకరానికి పిచికారి చేయాలని, రసం పీల్చే పురుగు నివారణకు ఇమిడాక్లొప్రెడ్ 0.3మిల్లీటీటరు లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. పిండినల్లి నివారణకు ప్రొఫెనోపాస్ 3 మి.లీ నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. వరిలో మొగి పురుగు నివారణకు కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు ఎకరానికి 8కిలోలు లేదా క్లోరాంత్రనిలిప్రోల్ 0.4జీ గుళికలు 4 కిలోల చొప్పున చల్లుకోవాలన్నారు. వరిలో జింక్ లోపానికి 2గ్రా. జింక్ సల్ఫేట్, లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. మొక్కజొన్నలో ఆకుమాడు తెగులు నివారణకు ప్రోపి కోనాజోల్ 1మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలని సూచించారు. క్షేత్ర సందర్శనలో పొలాస పరిశోధనస్థానం శాస్త్రవేత్తలు గోన్యానాయక్, బలరాం, రవి, శ్వేత, జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ కో ఆర్డినేటర్ డాక్టర్ మదన్‌మోహన్‌రెడ్డి, ఆయా జిల్లాల రైతులు పాల్గొన్నారు.

బురదలో దిగబడిన బస్సు

- బయటకు నెట్టిన నాయకులు



బురదలో దిగబడిన ఆర్టీసీ బస్సు

వీర్నపల్లి, ఆగస్టు 22: మండల కేంద్రంలో డబుల్ రోడ్డు నిర్మాణ పనుల్లో భాగంగా రోడ్డును తవ్వి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వదిలేయడంతో వర్షాలకు ప్రధాన రహదారి బురద మయంగా మారింది. రోడ్డంతా బురదతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం వన్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బురదలో దిగబడిపోయింది. దీంతో ప్రయాణికులు బస్సులో నుంచి దిగారు. అక్కడే రైతు ధర్నా పాల్గొనేం దుకు వచ్చిన బీఆర్ఎస్ నాయకులు బస్సును వెనకనుంచి నెడుతూ బురదలో నుంచి బయటకు తీశారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోమండల ప్రజలు బురదరోడ్డుతో ఇబ్బందులు పడుతున్నాపట్టించుకునే వారు లేరని వాపోయారు.

తండాల్లో తీజ్ వేడుకలు



బావ్‌సింగ్‌నాయక్ తండాలో తీజ్ వేడుకలు నిర్వహిస్తున్న స్థానికులు

వీర్నపల్లి, ఆగస్టు 22: పలు తండాల్లో గురువారం తీజ్ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో గిరిజన యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. వీర్నపల్లి మండలంలోని బావ్ సింగ్ నాయక్ తండా, మద్దిమల్ల తండా, భూక్యతండా, జవహర్లాల్ నాయక్ తండా గ్రామాలతో పాటు పలు తండాల్లో గిరిజనులు తీజ్ పండగను గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా అల్ ఇండియా బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు గుగులోతు సురేష్‌నాయక్ మాట్లాడుతూ తండాల్లో పెళ్లికాని ఆడపడుచులు పందిరి వేసి బుట్టలలో ఆవు ఎరువు వేసి నవధాన్యాలను నానబెట్టడం సాంప్రదాయమ న్నారు. మొలకెత్తిన నారు బుట్టలకు ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేస్తారన్నారు. అనంతరం గిరిజనులు డప్పు చప్పుళ్ల మధ్య సాంప్రదాయ నృత్యాలతో నిమజ్జనం చేస్తారన్నారు. తీజ్ పండుగ గిరిజనుల సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గుగులోతు కళావతి, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు శ్రీరామ్ నాయక్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, ఆయా తం డాల్లో తండా నాయక్‌లు, పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంతో పాటు బుగ్గరాజేశ్వరతండా, కిష్టునాయక్‌తండా, తిమ్మాపూర్ తండా, గుంటపల్లిచెరువు తండాల్లో గురువారం సాయంత్రం తీజ్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పందిరిని ఏర్పాటు చేసి గిరిజన యువతులు వారం రోజుల పాటు ఉపవాస దీక్షలతో ప్రత్యేక పూజలు జరిపారు. భక్తిశ్రద్ధలతో గోధుమ బుట్టల్లో నీరు పోశారు. చివరి రోజున గోధుమ బుట్టలను పందిరి నుంచి తీసి డప్పుచప్పుళ్ల నడుమ ఊరేగించారు. సాంప్రదాయ పాటల మధ్య నృత్యాలు చేశారు. అనంతరం సమీప నీటి వనరుల్లో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, తాజా, మాజీ సర్పంచులు రజిత, ప్రభునాయక్, తండా పెద్దలు తిరుపతినాయక్, సీత్యానాయక్, సూర్యనాయక్, హరిదాసునాయక్ తదితరులు పాల్గొన్నారు.



బుగ్గరాజేశ్వరతండాలో గోధుమనారు బుట్టలతో యువతులు

క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



మాట్లాడుతున్న దీపక్ జాన్ రాజ్

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 22: క్రైస్తవులకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ రాజ్ అన్నారు. గురువారం స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో కరీంనగర్ క్రిస్టియన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా పాస్టర్లు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా దీపక్ జాన్ రాజ్ మాట్లాడుతూ విద్య, వైద్య రంగాల్లో మైనారిటీ విద్యార్థుల విషయంలో శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఉచిత స్కాలర్‌షిప్‌లు, మైనారిటీ హాస్టళ్లలో వసతిని అందిస్తున్నామని అన్నారు. క్రైస్తవుల స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా రూపొందిస్తు న్నామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో ప్రత్యేక భేటీ అనంతరం తదుపరి కార్యాచరణను తెలియజేస్తామని అన్నారు. క్రైస్త వులపై జరుగుతున్న దాడులకు కొంతమంది న్యాయవాదులచే ఓ కమిటీని ఏర్పాటు చేసి దురాగతాలను అడ్డుకునే ప్రయత్నం చేస్తామని తెలిపారు. క్రైస్తవ సమాజానికి ఒక నిధిని, ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయిం చాలని ప్రభుత్వాన్ని కోరుతామని తెలి పారు. సిఎస్ఐటీఏ ఆల్ ఇండియా బెన్ని షరీ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు జి కృపాదానం మాట్లాడుతూ గ్రామీణ యువతీ యువకులకు స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ కింద ఉపాధి అవకాశాల విషయంలో స్పందించాలన్నారు. విద్యార్థులకు ప్రత్యేక విద్యా బోధన కార్యక్రమం కింద స్టడీ సర్కిళ్ళు ఏర్పాటు చేయాలని వినతిపత్రం సమర్పిం చారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు ఎం క్రిష్టఫర్, కార్యదర్శి ఏ సురేశ్, వివిఎస్ బాల నాయక్, ప్రేంకుమార్, పాలు ముస్తఫా, మున్సిపల్ అడిష నల్ కమిషనర్ సువార్త, ప్రసాద్, పాస్టరేట్ చైర్మన్ పాల్ కొమ్మాలు, కార్యదర్శి సిహెచ్ దేవదాసు, ఓ పవన్, అశోక్, శ్యామ్, రాజు, కృపావరం తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులు

▸▸ రోడ్డుపైనే ఆర్టీసీ బస్సును నిలిపివేసిన డ్రైవర్

హుజూరాబాద్, ఆగస్టు 22: పరిమితికి మించి ప్రయాణికులు బస్సు ఎక్కారని, తాను నడపలేనంటూ ఓ ఆర్టీసీ డ్రైవర్ రోడ్డుపై బస్సును నిలిపివేశాడు. వివరాలిలా ఉన్నాయి. సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గురువారం వరంగల్‌కు వెళ్తూ మధ్యలో ఉండే హుజూరాబాద్ బస్టాండ్‌కు చేరుకుంది. అక్కడ పెద్ద ఎత్తున ప్రయాణికులు బస్సులో ఎక్కారు. ఓవర్ లోడ్ అవుతుందని, బస్సును నడిపే పరిస్థితి ఉండదని డ్రైవర్ ఎంత చెప్పినా ప్రయాణికు లు వినిపించుకోలేదు. బస్సును కిలోమీటర్ నడిపిన డ్రైవర్ ఇక నడపడం తన వల్ల కాదని చెప్పి రోడ్డుపై నిలిపివేశాడు. ఆ సమయంలో బస్సులో 180 మంది ప్రయాణికులు ఉన్నారు. రియర్ వ్యూ మిర్రర్ నుంచి ఇతర వాహనాలు తనకు కనిపించడం లేదని, ఏదైనా ప్రమాదం జరిగితే తనను బాధ్యుడిని చేస్తారని, తాను బస్సు నడప లేనని ప్రయాణికులకు చెప్పాడు. బస్సులోని ప్రయాణికులు తనకు సహకరించి దిగి పోవాలని అభ్యర్థించాడు. దీంతో కొంత మంది ప్రయాణికులు డ్రైవర్ చెప్పి న విషయాన్ని గమనించి బస్సు దిగిపోయారు. దీంతో యథావిధిగా బస్సు వరంగల్‌కు వెళ్లిపోయింది. గురువారం పెళ్లిళ్లు ఉండడంతో బస్సులో రద్దీ ఎక్కువగా ఉంది.



హుజూరాబాద్‌లో రోడ్డుపై నిలిపివేసిన ఆర్టీసీ బస్సు

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి
కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి ఎగువ ప్రాంతం నుంచి 9064 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. ఇందులో కడెం ప్రాజెక్టు నుంచి 3,994, క్యాచ్‌మెంట్ ఏరియా నుంచి 5072 క్యూసెక్కుల నీళ్లు వస్తున్నాయి. నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసె క్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, తాగునీటి అవసరాల కోసం 433 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తు న్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 15.352 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

జగిత్యాల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సారెస్పీలోకి 4,472 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరు తోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 51.023 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు 4,472 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రెండు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 22: లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. గురువారం రెండు పంపుల ద్వారా 6,300 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. ఇప్పటి వరకు గాయత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 17.6 టీఎంసీల నీటిని తరలించినట్లు అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ చిరువ్యాపారి మృతి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లికి చెందిన ఎండి ఖాజా (55) అనే చిరువ్యాపారి వరంగల్ ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. శుక్రవారం రాత్రి తన ఇంటిలో పురుగుల మందు తాగడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స అనంతరం విషమించి మృతిచెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగిన యువకుడు..

మానకొండూర్, ఆగస్టు 22: మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన పిట్టల ప్రవీణ్ (33) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి గురువారం చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రవీణ్ గతంలో కరీంనగర్‌లోని ఓ ప్రయివేట్ చిట్‌ఫండ్‌లో ఉద్యోగం చేస్తూ అప్పులు చేయగా వాటిని తీర్చేందుకు తన తండ్రికి చెందిన భూమివాటాను అమ్మి అప్పులు చెల్లించిన తీరలేదు. అప్పుల బాధ భరించలేక ఈ నెల 17న రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కుమార్తె ఉండగా మృతుని తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక సీఐ సదన్‌కుమార్ తెలిపారు.

అనారోగ్యంతో వృద్ధుడి ఆత్మహత్య

సైదాపూర్, ఆగస్టు 22: మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన మజ్జిగ కొంరయ్య(90) అనే వృద్ధుడు అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకా రం.. కొంరయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. దీంతో మనస్తాపం చెంది బుధవారం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంరయ్య కుమారుడు బీరయ్య గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

బసంత్‌నగర్‌లో..

పాలకుర్తి, ఆగస్టు 22: మండలం పరిధిలోని బసంత్‌నగర్‌లో ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమండ్ల తిరుపతి(50) కృష్ణానగర్ ప్రాంతానికి చెందిన వ్యక్తి. ఆరు నెలల క్రితం యాక్సిడెంట్ అయ్యి ఇంటివద్దనే ఉంటున్నాడు. దీంతో ఇంటి వద్ద భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయి. తీవ్ర మనస్తాపం చెందిన తిరుపతి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయబావిలో జారిపడి
మహిళా రైతు మృతి



సంతోషి మృతదేహం

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 22: సిరిసిల్ల పట్టణం ముష్టిపల్లి గ్రామానికి చెందిన చీమ సంతోషి(26) అనే మహిళా రైతు గురువారం సాయంత్రం ప్రమాదవశాత్తు వ్యవసాయబావిలో జారిపడి మృతిచెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. ముష్టిపల్లి గ్రామానికి చెందిన సంతోషి వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తోంది. ఈ క్రమంలో బావిలో నీళ్లు ఉన్నాయని గడ్డపై నుంచి చూస్తుండగా గడ్డి జారీ బావిలో పడింది. ప్రమాదవశాత్తు బావిలో పడుతుండగా పక్కనే మరోమహిళా రైతు ఉంది. వెంటనే చూసిన ఆ మహిళ కేకలు వేయడంతో చుట్టుపక్కల రైతులు వచ్చి బావిలో పడిన మహిళా రైతును పైకి తీసి చికిత్స కోసం జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి భర్త మహేశ్ ఉపాధి కోసం నెలరోజుల క్రితమే దుబాయ్ వెళ్లాడు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు.

రైలు నుంచి పడి గుర్తుతెలియని దివ్యాంగుడు..

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్ రైల్వే స్టేషన్, 35వ, రైల్వే గేటు మధ్యలో గుర్తుతెలియని దివ్యాంగుడు రైలు నుంచి పడి మృతిచెందాడు. ఈ సంఘటన ఎప్పుడు జరిగిందనేది స్పష్టంగా తెలియడం లేదు. దీంతో మృతదేహం చీమలు, కుక్కల పాలవుతోందని రైల్వే కార్మికులు విలేకరులకు తెలిపారు. గుర్తుతెలియని ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి ఉంటాడని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. దివ్యంగుడైన ఈ వ్యక్తి బూడిద కలర్‌షర్ట్ గీతాల డబ్బాలతో ఉన్న చొక్కా ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రైలు నుంచి పడి మృతిచెంది ఉంటాడని కొలనురు గ్రామస్తులు తెలిపారు. వెంటనే జీఆర్పీ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

హత్య ఘటనపై సీఐ విచారణ



కొలనూర్‌లో విచారణ నిర్వహిస్తున్న సీఐ సుబ్బారెడ్డి

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని కొలనూర్‌లో బుధవారం రాత్రి జరిగిన మాటూరి విజయ్ హత్య స్థలం వద్ద గురువారం సీఐ సుబ్బారెడ్డి, ఎస్ఐల బృందం సీన్ ఆఫ్ అఫెన్స్ నిర్వహించారు. బుధవారం రాత్రి మద్యం బెల్టు షాపులో ఒక వ్యక్తితో గొడవ జరగగా బయటకు వచ్చిన తర్వాత ప్రణాళికంగా హత్య జరిగిన తీరుపై సీఐ దర్యాప్తు నిర్వహించారు. అక్కడున్న నెత్తుటి నమూనాలను, హత్య జరిగిన తీరుపై నిందితుడితో జరిగిన వాగ్వాదంపై అక్కడి బెల్టుషాప్ యజమానిని విచారించారు. సిఐ వెంట ఎస్సైలు శ్రీధర్, నరేష్ కుమార్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

శంకరపట్నం, ఆగస్టు 22: శంకరపట్నం మండలం కేశవపట్నం పోలీస్ స్టేషన్ సమీపంలో కరీంనగర్-వరంగల్ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేశవపట్నం గ్రామానికి ఆరెల్లి సారయ్య అనే వ్యక్తి గురువారం ఉదయం కాలినడకన పోలీస్ స్టేషన్ వైపు వెళ్తున్న సమయంలో కేశవపట్నం వైపు వస్తున్న ఓ ద్విచక్ర వాహనం ఢీ కొట్టడంతో ఎడమ కాలు విరిగింది. కుటుంబ సభ్యులు ఘటన స్థలానికి చేరుకొని ఆస్పత్రికి తరలించారు.

రూ.7,450 పలికిన పత్తి ధర

జమ్మికుంట రూరల్, ఆగస్టు 22: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 7,450 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 12మంది రైతులు 205క్వింటాళ్లు విడి పత్తి విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 7,450, కనిష్ఠ ధర 6,900 రూపాయలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

చెట్టుకు బైక్ ఢీకొని యువకుడు మృతి

- నిశ్చితార్థానికి కొద్ది గంటల ముందే మృత్యువాత



సాధిక్(ఫైల్)

కథలాపూర్, ఆగస్టు 22: మరి కొద్ది గంటల్లోనే నిశ్చితార్థం చేసుకోవాల్సిన యువకుడు అతివేగంగా బైక్ నడిపి చెట్టుకు ఢీకొట్టి మృత్యువాత పడ్డ ఘటన పోసానిపేటలో విషాదం నింపింది. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. సాధిక్ (29) అనే యువకుడు ఏడు సంవత్సరాల అనంతరం ఈ నెల 11న దుబాయి నుంచి వచ్చాడు. సాధిక్ బుధవారం సాయంత్రం తాండ్ర్యాలకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైక్‌పై వెళ్లాడు. గురువారం తెల్లవారుజాము దాకా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. ఎంతకూ ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి రోడ్డు వెంట వెతుకుతూ వెళ్లారు. పోసానిపేట ఎల్లమ్మ శివారులో చెట్టుకు ఢీకొట్టుకుని పక్కనే ఉన్న గోతిలో శవమై కనిపించాడు. సాధిక్‌కు గురువారమే వరపూజ ఉండగా అనూహ్యంగా మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. మృతుడి అన్న అన్వర్‌పాషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని సింగరేణి కార్మికుడి మృతి

- ముందే హెచ్చరించిన 'ఆంధ్రజ్యోతి' కథనం





పొత్కపల్లి మూల మలుపు వద్ద ఢీకొన్న వాహనాలు, (ఇన్‌సెట్‌లో మృతి చెందిన రంజిత్‌కుమార్(ఫైల్))

ఓదెల, ఆగస్టు 22: మండలంలోని పొత్కపల్లి చెరువు మూలమలుపు వద్ద గురువా రం ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న సంఘటనలో మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీకి చెందిన పెండ్రు రంజిత్ కుమార్ అలియాస్ రఘు(39) అనే సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. అత్తగారి గ్రామమైన జీలకుంటలో తన కొడుకు బారసాల ఉండగా మంచిర్యాల జిల్లా సీసీ నస్పూర్ కాలనీ నుంచి ద్విచక్ర వాహనంతో వస్తుండగా, జమ్మికుంట నుంచి సుల్తానాబాద్ వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు పొత్కపల్లి ఊర చెరువు మూలమలుపు వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రంజిత్ కుమార్ తీవ్ర గాయాలకు గురికాగా సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఇప్పటివరకు పొత్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదు. కాగా, ఈనెల 13న, పొత్కపల్లి చెరువు మూలమలుపుపై 'ఆంధ్రజ్యోతి'లో మూలమలుపు వద్ద పొంచి ఉన్న ముప్పు అనే కథనం ప్రచురితమైంది. అయినప్పటికీ అధికారులెవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు. ఇంతలోనే మరో రోడ్డు ప్రమాదం సంభవించి తన కొడుకును కళ్లారా చూసుకోక ముందే సింగరేణి కార్మికుడు దుర్మరణం చెందాడు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

గన్నేరువరం, ఆగస్టు 22: మండల కేంద్రంలో రెండు ద్విచక్రవాహనాల ఢీకొన్న ప్రమాదంలో గాయపడ్డ మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి(60) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మైలారం గ్రామానికి చెందిన కాదసి ఎల్లస్వామి ద్విచక్రవాహనం (ఏపీ15ఏ25560)పై సోమవారం గన్నేరువరం వచ్చి వెళుతున్న క్రమంలో తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఎదురుగా గన్నేరువరం గ్రామానికి చెందిన బుర్ర రాజ్‌కోటి బైక్ (టీఎస్02ఈబీ7263) ఢీకొట్టినట్లు ఎల్లస్వామి కూతురు వనజ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే బుర్ర రాజ్‌కోటి తహసీల్దారు కార్యాలయం ఎదుట తన బైక్‌ను రోడ్డు పక్కన పెట్టుకుని ఉండగా మైలారం గ్రామస్థుడు కాదసి ఎల్లస్వామి తన ద్విచక్రవాహనంతో ఢీకొట్టినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎల్లస్వామికి తలకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించిన డీజీఎం

పెద్దపల్లి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భారతీష్ కుమార్ జైన్ గురువారం పెద్దపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ జరుగుతున్న రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను పరిశీలించారు. ప్లాట్ ఫారంలు, స్టేషన్‌ను పరిశీలించారు. పెద్దపల్లి నుంచి నిజామాబాద్, కాజీపేట నుంచి సిర్పూర్ కాగజ్‌నగర్ సెక్షనలలో నెలకొన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని ఉత్తర తెలంగాణ రైల్వే ఫోరం ఉపాధ్యక్షుడు అజయ్ క్రాంతి సింగ్, కమిటీ సభ్యుడు దేవి సింగ్ ఠాకూర్ డీఆర్ఎంకు వినతిపత్రం అందజేశారు. తిరుపతి- కరీంనగర్ బై వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును నిజామాబాదు వరకు పొడిగించి వారానికి ఐదు రోజులు నడపడాలని, కరీంనగర్ నుంచి సికింద్రాబాద్‌కు వందే మెట్రో ఎక్స్‌ప్రెస్ రైలు నడపాలని, నిజామాబాదు నుంచి వరంగల్‌కు మెము ఎక్స్‌ప్రెస్ పుష్ పుల్ రైలు వయా పెద్దపల్లి మీదుగా నడపాలని, కాజీపేట నుంచి దాదర్ ముంబై వీక్లీ ప్రత్యేక రైళ్లను పునరుద్ధరించడంతో పాటు వాటిని వారానికి మూడు రోజులు పెంచాలని కోరారు. పెద్దపల్లి, బల్లార్షా మీదుగా కోల్‌కతాకు నూతన రైలు సర్వీసు నడపాలని, పూర్వ నాగపూర్ ప్యాసింజర్ రైలును పునరుద్ధరించి చర్లపల్లి టెర్మినల్ వరకు పొడిగించాలని విజ్ఞప్తి చేశారు.



డీఆర్ఎంకు వినతి పత్రం ఇస్తున్న ఫోరం సభ్యులు

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, ఆగస్టు 22: పట్టణంలోని అతి పురాతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. ఆలయంలో శ్రీలక్ష్మిదేవి, విష్వక్సేన, ఆంజనేయ, ద్వార పాలక రాజగోపుర శిఖర, విమాన వేంకటేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని వేద పండితులు చక్రపాణి మాధవాచార్య, చక్రపాణి నరసింహమూర్తి, బీర్నంది నరసింహచారి మంత్రోచ్చారణ మధ్య సాగింది. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి కల్యాణం జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్నప్రసాదం స్వీకరించి మొక్కులు చెల్లించుకున్నారు. మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కాంగ్రెస్ సీని యర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య - అనిల్, కౌన్సిలర్ పు ప్పాల ఉమాదేవి - ప్రభాకర్, ఎంబేరి నాగభూషణం, పెండం గణేష్, ఆడెపు కమల - మధు, దేవాలయ ఈవో విక్రం, సీనియర్ అసిస్టెంట్ నర్సయ్య, నాయకులు జక్కుల ప్రసాద్, కొత్త సురేష్, గండ్ర అజేందర్‌రావు, జుబర్తి రమేశ్, వేంకటేశ్వర భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంకటహర చతుర్థి పూజలు



గణపతి ఆలయంలో అభిషేకం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, ఆగస్టు 22: ధర్మపురి క్షేత్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద గల గణపతి దేవాలయంలో సంకటహర చతుర్థి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో లోక కల్యాణార్థం గణనాథుడికి వేదపండితులు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణల మధ్య శాస్త్రోక్తం గా ఉపనిషత్‌లతో అభిషేకం, విశేష పూజలు, హారతి, మంత్ర పుష్పం నిర్వహించారు. సకల కష్టాలు తొలగిపోవాలని కోరుతూ అర్చకులు ఈ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గోదావరి నదిలో స్నానాలు చేసిన భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పౌరోహితులు బొజ్జ సంతోష్‌కుమార్, అర్చకులు ద్యావళ్ల విశ్వనాధ్‌శర్మ, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

శిక్ష పడే విధంగా నేర పరిశోధన జరగాలి

- నేర సమీక్ష సమావేశంలో సీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, ఆగస్టు 22: నేరస్థులకు శిక్షలు పడేలా అవసరమైన ఆధారాలు సేకరించే దిశగా నేర పరిశోధన జరగాలని, ప్రతి సీడీ ఫైల్‌ను, అందులోని డాక్యుమెంట్‌ను పరిశీలించి చార్జ్‌షీట్‌ను ఫైల్ చేయాలని సీపీ శ్రీనివాస్ సూచించారు. గురువారం కమిషరేట్‌లో బెల్లంపల్లి సబ్‌డివిజన్ క్రైమ్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అండర్ ఇన్విస్టిగేషన్ కేసులను త్వరగా డిస్పోజ్ చేయాలని, ఫోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులు త్వరగా విచారణ జరిపి చార్జ్‌షీట్ దాఖలుచేయాలన్నారు. ప్రతి ఫైల్‌లో ప్లానఆఫ్ యాక్షన్ సీడీ ఫైల్ పొందుపరచాలన్నారు. ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ, మహిళలకు సంబంధించి కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. నేరాల నియంత్రణకు విజిబుల్ పోలీసింగ్, నింతరం పెట్రోలింగ్‌తో పాటు సాంకేతిక వ్యవస్థను కూడా వినియోగించుకోవాలన్నారు. డయల్ 100ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ఎన్‌బీడబ్ల్యూలను మూడంచెల పద్ధతి ద్వారా పూర్తి స్థాయిలో అమలు చేయాలన్నారు. కమిషనరేట్ పరిధిలో మొదటి దశ, రెండు రాష్ట్రాల పరిధిలో రెండవ దశ, ఇతర రాష్ట్రాలకు సంబంధించి మూడో దశగా విభజించి ప్రణాళిక ప్రకారం ప్రత్యేక టీంలను ఏర్పాటుచేసి అమలుచేయాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని, మత్తు పదార్థాల రవాణాను అరికట్టాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్, ట్రాఫిక్ ఏసీపీ నర్సింహులు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

పోలీస్ క్రీడాకారుడికి ఘన సన్మానం

జూలపల్లి, ఆగస్టు 22 : వాలీబాల్ పోటీల్లో రాణిస్తున్న మండలకేంద్రానికి చెందిన అమరగాని గంగాధర్ అనే పోలీస్ క్రీడాకారుడిని గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు మానుమండ్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పలువురు యువకులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ మండలంలో నిలిచిన 108 సేవలు

● ఇబ్బందులు పడుతున్న క్షతగాత్రులు ● పట్టించుకోని అధికార యంత్రాంగం



కమాన్‌పూర్ పీహెచ్‌సీలో మరమ్మతులకు నోచుకోని 108 వాహనం

కమాన్‌పూర్, ఆగస్టు 22 : ప్రమాదంలో గాయపడిన, మృతిచెందిన వారిని ప్రభుత్వాసుపత్రులకు తరలించేందుకు మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా 108 వాహన సేవలను ప్రారంభించారు. అయితే ఈ సేవలు కమాన్‌పూర్ మండలంలో బాధితులకు అందుబాటులో ఉండడం లేదు. కమాన్‌పూర్, రామగిరి మండలాలకు చెందిన 108వాహనం రిపేరుకు రావడంతో హైదరాబాద్‌కు తరలించారు. తిరిగి వాహనం మండలానికి రాకపోవడంతో దాని స్థానంలో మరో 108 వాహనాన్ని ఏర్పాటు చేయగా అది కూడా కొద్దిరోజులకే రిపేరుకు వచ్చింది. దీంతో అత్యవసర చికిత్స కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి 108 వాహన సేవలను అందుబాటులోకి తీసుకరావాలని కోరుతున్నారు.

అత్యవసర సేవలపై నిర్లక్ష్యం వద్దు..

- రానవేన లక్ష్మీనారాయణ, కమాన్‌పూర్



ప్రజలకు అత్యవసర సేవలైన 108 వాహన సేవలు మండలంలో నిలిచిపోవడం ఆందోళన కలిగిస్తోంది. సామాన్య ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంచాల్సిన సర్వీసు నిర్వహణపై అధికారులు నిర్లక్ష్యం చూపవద్దు. వెంటనే 108 సేవలను అందుబాటులోకి తేవాలి.

పెద్దపల్లి పట్టణంలో కుక్కల బెడద

- బయటికి వెళ్లడానికి భయపడుతున్న ప్రజలు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 22: పెద్దపల్లి పట్టణంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. మూడు నెలలుగా కుక్కల భయంతో జనం వణికిపోతున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో కుక్క కాటు బాధితుల సంఖ్య పెరిగిపోతోంది. ఒంటరిగా కనిపిస్తే వెంటపడి దాడి చేస్తున్నాయి. వీటి బాధకు ఇంటినుంచి బయటకు రావాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలోని పలు వార్డుల్లో కుక్కలు గుంపులుగా చేరి వీధుల్లో స్వైర విహారం చేస్తున్నాయి. అంతేకాకుండా ద్విచక్ర వాహనదారుల వెంటపడి మరీ తరుముతున్నాయి. పరిస్థితి ఇంత తీవ్రంగా ఉన్నా మున్సిపాలిటీ సిబ్బంది ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై కలెక్టర్ కోయ శ్రీహర్ష సమావేశం ఏర్పాటు చేసి కుక్కలను నియంత్రించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ ఏలాంటి చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. ఇటీవల కుక్కల బారిన పడి పలువురు కుక్క కాటుకు గురయ్యారు. జిల్లాలో గత ఏడాది 2611 కుక్క కాటు కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 2 వేల పైచిలుకు మంది కుక్క కాటుకు గుర య్యారు. ఈ కేసుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.



గోదావరిఖనిలో మాట్లాడుతున్న కోరుకంటి చందర్



పెద్దపల్లిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మంథనిలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రైతాంగాన్ని దగా చేసిన రేవంత్ సర్కార్

- వంద శాతం రుణమాఫీ జరిగే దాకా వదిలేది లేదు - రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్

గోదావరిఖని, ఆగస్టు 22: ఎన్నికల్లో తెలంగాణ రైతంగానికి వంద శాతం రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని హామి ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ 40శాతం మంది మాత్రమే రుణమాఫీ చేసి రైతంగాన్ని దగా, మోసం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నేరవేర్చేదాకా వదిలేదిలేదని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రూ.2లక్షల రుణమాఫీ కోసం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ రైతు ధర్నా కార్యక్రమాన్ని చందర్ నిర్వహించారు. తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు 40శాతం మాత్రమే రుణమాఫీ చేసి రైతులను మెసం చేస్తుందన్నారు. ఎన్నికల సమయంలో ఒక మాట, ఎన్నికలు అయ్యాక మరో మాటతో ఓడ దాటే వరకు ఓడ మల్లన్న, ఓడ దాటినా తర్వాత బోడ మల్లన్న అన్న చందంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కేసీఆర్ పాలనలో రైతుల ముఖాల్లో అనందం నిండితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో రైతులకు కన్నీరు మిగిలిందన్నారు. రుణమాఫీలో ఇంకా జ్యాపం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి, నాయకులకు తగిన బుద్ధి చెప్పేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరిం చారు. రైతుల పక్షాన పోరాటం చేయాడానికి కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కోట్లాడుతున్నారని, రైతు రుణమాఫీ అమలు అయ్యేదా క బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ టీసీ ఆముల నారాయణ, బాదె అంజలి, గాదం విజయ, కల్వచర్ల కృష్ణవేణి, నాయకులు జేవీ రాజు, నారాయణదాసు మారుతి, రాకం వేణు, మేడి సద య్య, చల్లగురుగుల మొగిళి, పిల్లి రమేష్, బొడ్డుపల్లి శ్రీనివాస్, నూతి తిరు పతి, అల్లం రాజన్న, ధరణి రాజేష్, చెలకలపల్లి శ్రీనివాస్, బొడ్డు రవీందర్, అచ్చే వేణు, అడప శ్రీనివాస్, మేతుకు దేవరాజ్, నీరటి శ్రీనివాస్, జిట్టవేని ప్రశాంత్ కుమార్, చింటూ, ఇరుగురాళ్ల శ్రావన్, ముద్దసాని సంధ్యారెడ్డి, తోకల రమేష్, సట్టు శ్రీనివాస్, కోల సంతోష్, కిరణ్ జీ, పాలడుగుల కనక రాజ్, ఆవునూరి వెంకటేష్ పాల్గొన్నారు.

పెద్దపల్లిటౌన్ : ఎన్నికల ముందు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే చింతకుంట దాసరి మనోహర్‌రెడ్డి ధ్వజమెత్తారు. రైతులకు ఏలాంటి ఆంక్షలు లేకుండా రైతు రుణ మాఫీ చేయాలంటూ గురువారం బస్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు అన్ని విధాలా ఆదుకొని ఎన్నో సహాయ సహకారాలు అందించిందన్నారు. మంత్రి వర్గ సమావేశంలో 31 వేల కోట్ల రూపాయలు రైతు రుణమాఫీ చేస్తామని బడ్జెట్‌లో 26 వేల కోట్ల రూపాయలు ప్రవేశపెట్టి, కేవలం 17వేల కోట్ల రూపాయల రుణాలు మాత్రమే మాఫీ చేసిందని వివరించారు. దీంతో పావలా వంతు రైతుకు రుణ మాఫీ కాలేదన్నారు. రుణాలు మాఫీ అవుతాయో లేదోనని రైతులు ఆందోళనలకు గురవుతున్నారు. ఇచ్చిన మాట ప్రకారం రైతుల 2 లక్షల రుణాల మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమాలు ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మర్కు లక్ష్మన్, రఘువీర్‌సింగ్, పట్టణాధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, హన్మంతు, స్వామి, పెంచాల శ్రీదర్, కనుకూర్తి కార్తీక్, సలేంద్ర రాములు, గణపతి రాజేష్, పూదరి చంద్రశేఖర్, అర్కుటి రామస్వామి, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : భేషరతుగా రైతులందరికీ రుణమాఫీ వర్తింప చేయాలని సుల్తానాబాద్ మాజీ ఎంపీపీ బాలాజీ రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బుర్ర శ్రీనివాస్‌గౌడ్, విద్యార్థి జేఏసీ మాజీ చైర్మన్ సూర శ్యామ్, కౌన్సిలర్ గొట్టం లక్ష్మీ మల్లయ్య తదితరులు డిమాండ్ చేశారు. సుల్తానాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో, ధర్నా వంటి ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. అంతకుముందు పోలీసులు పలువురు బీఆర్ఎస్ నేతల ఇళ్ల వద్దకు వెళ్లి ముందుస్తుగా అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయినా కొంతసేపటి వరకు బీఆర్ఎస్ నేతలు సుల్తానాబాద్ పట్టణంలో రాజీవ్ రహదారిపై రాస్తారోకో చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీని ఏకకాలంలో వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. సీఎం అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ నాయకులు తిప్పారపు దయాకర్, సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్‌రావు, బాబురావు, తిరుపతి, సర్వర్, ముత్యా లు, గొట్టం అంజయ్య, రమేష్, తోట వెంకటేశ్, పట్టణ యూత్ అధ్యక్షులు వాహిద్, కర్రె కుమార్, నరేందర్, రఫీక్, కాంపల్లి రాజు, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ అన్నెడీ మహిపాల్ రెడ్డి, మహేందర్, మల్లిఖార్జున్, శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : రైతులకు రుణమాఫీ చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ అన్నారు. రైతు రుణ మాఫీపై మాట తప్పిన కాంగ్రెస్ వైఖరిని నిరసిస్తూ మండల కేంద్రంలో రహదారిపై బైఠాయించి బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దార్ శంకర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ నూనేటి సంపత్ మాట్లాడుతూ రుణమాఫీపై లేనిపోని ఆంక్షలు పెట్టి తెలంగాణ రైతాంగాన్ని నిలువునా మోసం చేసిన రేవంత్ సర్కారు వెంటనే అర్హులైన రైతులందరికి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కానీ రైతులు అధికారుల చుట్టూ బ్యాంకుల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎలాంటి ఆంక్షలు లేకుండా వెంటనే రెండు లక్షల రుణమాఫీ చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీలు జెట్టి దేవేందర్, కొల్లూరి రమ రాయమల్లు, మాదాసి సువర్ణ రాంచంద్రం, బొల్లమల్ల కౌసల్య శంకర్, బీఆర్ఎస్ నాయకులు నిదానపురం దేవయ్య, కొట్టె రవీందర్, ఆకుల స్వామి, వివేక్ పటేల్, నూనేటి కుమార్, సువర్ణ బిట్టు, కుంభం రాజు, నరెడ్ల సదయ్య, సారంగపాణి, మేడుదుల రాజుకుమార్, కరుణాకర్‌రావు, కుంట శ్రీకాంత్, గొడుగు మల్లయ్య, రాంరెడ్డి, ధర్మల రవి, ఉమ్మల్ల రాయమల్లు, నాగరాజు పాల్గొన్నారు.

ఎలిగేడు : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో మాజీ ఎంపీపీ తానపర్తి స్రవంతి మోహన్‌రావు ఆధ్వర్యంలో రైతులు, పార్టీ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్‌రావు, మాజీ సర్పంచ్ కొండయ్య రాజా, నాయకులు న్యాతరి పోచయ్య, కవ్వంపల్లి బాపయ్య, తిరుపతిరెడ్డి, సత్యం, కనుకయ్య, అనిల్, రాజేశం, రవి, అనిల్, వినోద్, చంద్రయ్య, మల్లేశం, రైతులు పాల్గొన్నారు.

మంథని : రైతులకు వందశాతం రుణమాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం రేవంత్ సర్కార్ రైతులను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు విమర్శించారు. రైతులకు ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలనే డిమాండ్‌తో గురువారం ప్రధాన చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వందశాతం రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రేవంత్ సర్కార్ ఇప్పటివరకు కేవలం పావలా వంతు కూడా మాఫీ చేయలేదన్నారు. ఒకవైపు రుణమాఫీ చేయకపోగా రైతుబంధు ఊసెత్తడం లేదన్నారు. ఇప్పటి వరకు రూ.17,933 కోట్లు విడుదల చేసినట్లు చెప్తున్న ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.7,500 కోట్లు మాత్రమే వేసిందన్నారు. అంతేకాకుండా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ రూ.31వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పి సాయంత్రం బ్యాంకర్స్ మీటింగ్‌లో మాత్రం రూ.7,500 కోట్లు అని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్రంలో నీచమైన పాలన కొనసాగుతోందని, తాము ఇక్కడ ధర్నా చేస్తుంటే సమయం లేదంటూ మంథని సీఐ ఆంక్షలు పెడుతున్నాడని, పోలీసుల బెదిరింపులు, కేసులకు భయపడేది లేదన్నారు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే ఆనాడు మేనిఫెస్టో హామీలు ఇచ్చి మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ మంథని ఎమ్మెల్యేలపై చీటింగ్ కేసు పెట్టాలని, రాజ్యాంగాన్ని అవమానపర్చిన, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన వారిపై కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి కేబినెట్ హోదా ఇవ్వడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయ రంగాన్ని ఎలా అణచివేయాలనే కుట్రలో భాగంగా వ్యవసాయ సలహాదారుగా కేబినెట్ హోదా ఇస్తున్నారని విమర్శించారు. అర్హులైన ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని, రైతులను రుణమాఫీ పేరుతో మోసం చేసినందుకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఎగోలపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, మాచీడి రాజుగౌడ్, కిషన్‌రెడ్డి, గట్టయ్య, తిరుపతి, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.



సుల్తానాబాద్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కాల్వశ్రీరాంపూర్‌లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎలిగేడులో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



వీకేపీ గనిలో ప్రమాదం.. జంబో డ్రిల్ ఆపరేటర్‌కు గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 22: ఆర్‌జీ-2 ఏరియా వకీల్‌పల్లిగనిలో గురువారం మొదటి షిఫ్టులో ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో జంబో డ్రిల్ ఆపరేటర్ వేముల రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గనిలోని కంటిన్యూయస్‌మైనర్ 71 1/2 నార్త్ లెవల్ 34డిప్‌లో రమేష్ పని చేస్తుండగా పెద్ద శబ్దంతో సైడ్ కూలి రమేష్ ఎడమకాలుపై పడడంతో అతను గాయపడ్డాడు. వెంటనే అతన్ని సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

జీఎంకు సన్మానం

రామగిరి, ఆగస్టు 22: పదవీ విరమణ పొందుతున్న కార్పొరేట్ కాంట్రాక్ట్ మేనేజ్‌మెంట్ సెల్ జీఎం గుండా మోహన్‌రెడ్డిని గురువారం ఆర్జీ-3 జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆర్జీ-3, ఏపీఏ ఇన్‌చార్జి జీఎంలు రాధాకృష్ణ, వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులు, రఘుపతి, నారయణ, శేఖర్‌బాబు, విశ్వేశ్వర్‌రావు, రమేశ్, జనార్ధన్, ఐలయ్య, సుదర్శన్, సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సత్తా చాటాలి : సీఎండీ



రెస్క్యూ విన్యాసాలను తిలకిస్తున్న సీఎండీ బలరాం

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 22: అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో సింగరేణి సత్తా చాటాలని సంస్థ సీఎండీ ఎన్ బలరాం అన్నారు. బుధవారం రాత్రి సింగరేణి రెస్క్యూ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. సెప్టెంబరు నెలలో కొలంబియాలో జరగనున్న అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొనే సింగరేణి జట్టు విన్యాసాలను ఆయన తిలకించారు. శిక్షణ తీరును అడిగి తెలుసుకున్నారు. ఫైర్ ఫైటింగ్, రోప్ రెస్క్యూ, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూఅండ్ రికవరీ విభాగాల్లో జట్లకు పలు సూచనలు చేశారు. దేశంలోనే సింగరేణి రెస్క్యూకు మంచి పేరు ఉన్నదని, అంతర్జాతీయ పోటీల్లో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. అనంతరం జట్ల సభ్యులను పరిచయం చేసుకుని, శుభాకాంక్షలు తెలిపారు. సీఎండీ వెంట డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, ఆర్జీ-2,3 జీఎంలు సూర్యనారాయణ, సుధాకర్‌రావు, రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి, రెస్క్యూ సూపరెడెంట్ మాధవరావు ఉన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించండి'

శ్రీరాంపూర్, ఆగస్టు 22: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా అన్నారు. ఏరియావర్క్‌షాప్, ఆటో వర్క్‌షాప్‌లో గురువారం వారు పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం డీజీఎం రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు.

వేతనాల కోసం కాంట్రాక్టు డ్రైవర్ల ఆందోళన

మందమర్రి టౌన్, ఆగస్టు 22: మందమర్రి కేకేఓసీలో పని చేస్తున్న కాంట్రాక్టు డ్రైవర్లు వేతనాల కోసం ఆందోళన బాటపట్టారు. రెండురోజులుగా విధులు బహిష్కరించి జీఎం కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీయూ నాయకుడు వెంకట స్వామి మాట్లాడుతూ పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే ఆందోళన చేపడుతామన్నారు.

కళా సంఘాల ఆధ్వర్యంలో జానపద దినోత్సవం

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 22: ప్రపంచ జానపద దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గోదావరిఖని కళాసంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో సింగరేణి ఎస్సీ ఎస్టీ సంక్షేమ సంఘ కార్యాలయంలో జానపద దినోత్సవాన్ని ఘనంగా జరిగింది. సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో పారిశ్రామిక ప్రాంతంతో పాటు రాష్ట్ర స్థాయిలో అనేక డప్పు ప్రదర్శనలు ఇచ్చిన బెజ్జుల రమేష్ కళా బృందాన్ని జానపద పురస్కార్-2024తో సత్కరించారు. ఈసందర్భంగా కనకం రమణయ్య మాట్లాడారు. జనం నుండి వచ్చిందే జానపదమని, అంతరించి పోతున్న ప్రాచీన జానపద కళారూపాలను కాపాడుకోవాల్సిన బాధ్యత కళాకారులపై, ప్రభుత్వాలపై ఉన్నదని అన్నారు. సాంప్రదాయ కళలను బ్రతికించుకునేలా ప్రతిఏటా రాష్ట్ర ప్రభుత్వం జానపద ఉత్సవాలను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాదరి శ్రీనివాస్, నాగుల శ్రీనివాస్, రాజమౌళి, పోషం, బాలాజీ, వెంకటేశ్వరరావు, సంతోషి, సందీప్, సంపత్ పాల్గొన్నారు.

యోగా పోటీలకు గుండారం విద్యార్థుల ఎంపిక

కమాన్‌పూర్, ఆగస్టు 22 : మండలంలోని గుండారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు యోగా పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం రమణారెడ్డి గురువారం తెలిపారు. యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన పెద్దపల్లి జిల్లా స్థాయి యోగా సెలక్షన్స్‌లో గుండారం ప్రాథమికోన్నత పాఠశాలలో టీ. మల్లయ్య ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు 8-10 సంవత్సరాల విభాగంలో 4వ తరగతి చదువుతున్న ఎలువాక రిషిత, మహ్మద్ జునీమహీన్, చొప్పరి లక్ష్మీప్రసన్న, పిడుగు తేజశ్రీ, అలాగే 10-12 సంవత్సరాల విభాగంలో తాళ్ల అరుణ్‌కుమార్, కుంభం శివ మారుతిలు మొత్తం ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు.ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి

కోల్‌సిటీటౌన్, ఆగస్టు 22: విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. మార్కండేయ కాలనీలోని నారాయణ హైస్కూల్‌లో నూతన విద్యా సంవత్సర ప్రారంభోత్సవం సందర్భంగా ఇనిస్టిట్యూట్ సెర్మనీ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ చిన్న వయస్సు నుండే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునే దిశగా విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. కేవలం మార్కులే ప్రామాణికం కాదని అన్నారు. చదవుతో పాటు ఆటలు, యోగా వంటివి అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సీఐ అన్నారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో ఏజీఎం చైతన్యరావు, ట్రాఫిక్ ఎస్సై హరిశేఖర్, ప్రిన్సిపాల్ రజినితో పాటు సిబ్బంది, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

నేత్ర దాతల కుటుంబాలకు అభినందన పత్రాల అందజేత

రామగిరి, ఆగస్టు 22: రామగిరి మండలంలో నేత్ర దాతల కుటుంబాలకు సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభినందన పత్రాలు అందజేశారు. కల్వచర్ల, రాజాపూర్ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన కూర సతీష్, బుక్క కొమురక్కల సంస్మరణ సభలకు హాజరైయ్యారు. ఈ సందర్భంగా సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సి.హెచ్ లింగమూర్తి చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అభినందన పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు సానా రామకృష్ణరెడ్డి, మాజీ జడ్పీటీసీ గంటవెంకటరమణరెడ్డి, ఓదెలు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మొక్క నాటుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిటౌన్,ఆగస్టు 22: ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని పెద్దపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అమ్మకు గుర్తుగా చెట్టు కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ప్రగతి నగర్ బీసీ హాస్టల్ (బాలికలు)లో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మమతారెడ్డి మాట్లాడుతూ అమ్మకు గుర్తుగా చెట్టు కార్యక్రమంలో విద్యార్థుల చేత మొక్కలు నాటించడం సంతోషంగా ఉందన్నారు. ప్రస్తుతం వాతావరణంలో మార్పుల కారణంగా వస్తున్న జ్వరాల పట్ల పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో పాత టైర్లు ,వాడి పడేసిన కొబ్బరిబోండాలలో నీరు ఉన్నట్లయితే వాటిపై లార్వా ఏర్పడి దోమలు వృద్ధి చెందుతాయన్నారు. ఎక్కడా నీరు నిల్వలేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాల పట్ల మున్సిపల్ కౌన్సిల్, కమిషనర్ అప్రమత్తంగా ఉన్నారన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, వార్డు కౌన్సిలర్ రెవెల్లి స్వామి, మేనేజర్ శివప్రసాద్, ఏఈ సతీష్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, అనిల్ కుమార్, లక్ష్మీ నర్సయ్య, నర్సరీ ఇంచార్జీ సదానందం, వార్డు ఇంచార్జీ , రాజు, మెప్మా ఆర్పీ మల్లేశ్వరి, వార్డెన్ లావణ్య తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

వికలాంగురాలికి విజ్ఞన్న యువసేన చేయూత

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 22: పట్టణంలోని 8వ వార్డుకు చెందిన వికలాంగురాలు సల్మా సుల్తానా అనే యువతికి విజ్ఞన్న యువసేన వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లం వినోద్‌రెడ్డి చేయూతనిచ్చారు. గురువారం సల్మా సుల్తానాకు కిలోల బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎండి మేరాజ్, బాబా ఖాన్, అహ్మద్, షఫీ పాల్గొన్నారు

అఖిల భారత యాదవ మహాసభ యువత కార్యవర్గం

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 22: అఖిల భారత యాదవ మహాసభ యువత జిల్లా, నియోజకవర్గ, మండల, స్థాయి కమిటీలను ఎన్నిక చేసినట్లు అఖిలభారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు అట్ల సాగర్ యాదవ్ తెలిపారు. యువత జిల్లా ప్రధాన కార్యదర్శిగా మల్లెత్తుల నాగరాజు యాదవ్, జిల్లా ఉపాధ్యక్షునిగా చిట్టవెన వినీత్ యాదవ్, పెద్దపల్లి నియోజకవర్గ అధ్యక్షులుగా నర్ల సాయి కృష్ణ యాదవ్, పెద్దపల్లి మండలం యూత్ అధ్యక్షుడిగా భక్తుల లింగయ్య యాదవ్, ఉపాధ్యక్షుడిగా రేచవేన సురేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా చెలుకల వెంకటేష్ యాదవ్, పట్టణ అధ్యక్షునిగా వేలుంల చంద్ర కుమార్ యాదవులను నియామకం చేసినట్లు సాగర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఎన్నికైన వారికి నియామక పత్రాలను అందజేశారు.కార్యక్రమంలో మానుక శ్రీనివాస్, నల్ల శ్రీకాంత్, అజయ్, అశోక్, తిరుమలేష్, అనిల్, కళ్యాణ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

'దళిత కార్మికురాలిపై దాడి సరికాదు'

యైటింక్లయిన్‌కాలనీ, ఆగస్టు 22: దళిత మహిళా కార్మికురాలిపై ఏఐటీయూసీ నాయకులు దాడి చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు ఉల్లి మొగిలి ప్రకటనలో పేర్కొన్నారు. దాడికి గురైన మహిళా కార్మికురాలు ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకురాలని, కానీ కాంగ్రెస్ పార్టీ నుండి గానీ ఐఎన్‌టీయూసీ ఆమెకు మద్దతు లభించలేదని అన్నారు. సదరు మహిళకు న్యాయం జరిగే వరకు సీఐటీయూ ఆమెకు అండగా నిలుస్తుందని అన్నారు. దళిత సంఘాలు ఐక్యంగా ఉండి పోరాడితే ఫలితం ఉంటుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు నోట్‌బుక్కుల పంపిణీ

రామగిరి, ఆగస్టు 22: మండలంలోని కల్వచర్ల ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రూ.15వేల రూపాయల విలువ గల ఆట వస్తువులు, బుక్కులను హైదరాబాద్ చిలుకలగూడ కట్టా మైసమ్మ ఆలయ ప్రధాన అర్చకుడు సౌమిత్రి తిరుమలచారి తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రమాదేవి, నాయకులు కొలిపాక సారయ్య, ఉపాధ్యాయులు గుండేటి సత్యనారాయణ, కుంట వెంకటేశం, సత్యవతి, శంకర్, రవీ, సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

వేణుగోపాలస్వామి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన

రామగిరి, ఆగస్టు 22: మండలంలోని కల్వచర్ల వేణుగోపాలస్వామి ఆలయంలో నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం గురువారం నిర్వహించారు. దాత బూసాల శ్రీనివాస్‌నాయుడు ఆలయ నిర్మాణం చేపట్టగా వేద పండితుల మంత్రోచ్ఛరణ మధ్య ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంటపద్మ వెంకటరమణరెడ్డి, శివరామకృష్ణ భజన మండలి సభ్యులు ఒడిత లక్ష్మీనివాస్, రేండ్ల వెంకటనారాయణ, భక్తులు, గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.